సాక్షి నిజామాబాద్

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



ఓపీఎస్‌ను అమలు చేయాలి

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీఎస్టీపోస్ నాయకులు ధర్నా నిర్వహించారు.

- IIలో ▸



చట్టబద్ధమైన జీవనం సాగించాలి

ప్రతిఒక్కరూ చట్టబద్ధమైన జీవనం కొనసాగించాలని సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి పేర్కొన్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /19.6

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశాలు న్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈవీఎంల పనితీరు పరిశీలనకు మాక్ పోల్



సుభాష్‌నగర్: నగరంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియలో భాగంగా శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి మాక్‌పోల్‌ను పరిశీలించారు. ప్రాథమిక పరిశీలన ద్వారా పనితీరు సక్రమంగా ఉన్నట్లు గుర్తించిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ప్రయోగాత్మకంగా పరిశీలన జరిపారు. ఈసందర్భంగా మాక్ పోల్ ప్రక్రియపై, ఈవీఎంల పనితీరుపై కలెక్టర్ వివరిస్తూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, సంబంధిత శాఖల అధికారులున్నారు.

షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడపాలి



బోధన్: మూతపడిన నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్(ఎన్డీఎస్ఎల్)ను తెరిపించి ప్రభుత్వమే నడపాలని ఎన్డీఎస్ఎల్ కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు నియమించిన కమిటీ త్వరలో బోధన్‌కు రానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం బోధన్ ఫ్యాక్టరీ ప్రధాన గేట్ ఎదుట కార్మిక నాయకులు సమావేశం నిర్వహించారు. కార్మికుల సమస్యలు కమిటీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు నాయకులు తెలిపారు. నాయకులు రవి శంకర్ గౌడ్, ఉపేందర్, బాలక్రిష్ణ, రహ్మత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వన్ డిస్ట్రిక్ట్ - వన్ ఎగ్జిబిషన్'

డొంకేశ్వర్(ఆర్మూర్): తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ), నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్-వన్ ఎగ్జిబిషన్' ప్రదర్శనను జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం (నేడు) ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన గ్రామీణ ఆవిష్కరణలు ప్రదర్శించడానికి ఇదొక చక్కటి వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యవసాయం, నీటిపారుదల, వ్యర్థాల నిర్వహణ, పాడి పరిశ్రమ, గ్రామీణాభివృద్ధి, తదితర అంశాల్లో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించేందుకు మార్కెట్‌కు సిద్ధంగా ఉన్న తక్కువ ధర ఆవిష్కణలు ఉంటాయన్నారు. ఇందులో 30మంది పల్లె సృజన ఆవిష్కర్తలు పాల్గొంటారని, మార్కెటింగ్ సౌలభ్యం, వ్యాపారాల అవకాశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, విద్యార్థులు, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని ఈడీఎం కోరారు.

వలకు చిక్కిన భారీ చేప



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులో జాలరి వలకు ఓ భారీ చేప చిక్కింది. హసన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మణ్ శుక్రవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టు హెడ్‌స్లూయిస్ ప్రాంతంలో చేపలు పడుతుండగా భారీ చేప వలలో పడింది. దానిని తూకం వేయగా 21 కిలోల బరువుంది.



నగరంలోని నీలకంఠేశ్వరాలయ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రమణీయం.. రథోత్సవం..

జిల్లా కేంద్రంలోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన రథోత్సవం రమణీయంగా సాగింది. రథయాత్రను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రారంభించారు. విమాన రథంపై శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారిని పార్వతీ సమేతంగా ఊరేగించారు. రథోత్సవంలో భక్తుల కోలాటాలు, హరినామ భజనలు, సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు స్రవంతి రెడ్డి, మాస్టార్ శంకర్, మమత ప్రభాకర్, ఆకుల హేమలత శ్రీనివాస్, ఆలయ ఈవో వేణు, అర్చకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

– నిజామాబాద్ సిటీ



రథంపై స్వామివారు



రథయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

కష్టపడితే కాంగ్రెస్‌లో గుర్తింపు





సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు

- డీఎస్ నా రాజకీయ గురువు
- దేవుళ్ల పేరిట బీజేపీ రాజకీయం
- ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుంది
- రూ. 7 లక్షల కోట్ల అప్పులు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

ఖలీల్‌వాడి: బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏళ్లలో రూ. 7 లక్షల కోట్ల అప్పు చేసిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌లో గల మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఆయనకు పార్టీ శ్రేణులు నిర్వహించిన సన్మాన సభ మాట్లాడారు. కాంగ్రెస్‌లో కష్టపడి పని చేస్తే గుర్తింపు వస్తుందన్నారు. మారుమూల గిరిజన గ్రామమైన రాహత్‌నగర్ నుంచి వచ్చిన తనకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు కల్పించిందన్నారు. ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, టీపీసీసీలో పనిచేశానన్నారు. రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డితో చొరవతోనే ఎమ్మెల్సీ పదవి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అప్పులు చేసి కాంగ్రెస్‌కు చిప్ప ఇచ్చారని శాసనమండలి సమావేశాలలో తాను ఎమ్మెల్సీ కవితతో అన్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులను తీరుస్తుందన్నారు. ప్రజాగ్రహానికి గురై కేసీఆర్ ఇంటికి పోయాడన్నారు. ప్రజల చేతనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ వదిలేసిన 30 వేల ఉద్యోగాలకు సంబంధించిన పత్రాలను అందించిందన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు, ఐదేళ్లలో మరో లక్ష ఉద్యోగాలు అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ పీసీసీ చీఫ్ డి.శ్రీనివాస్ (డీఎస్) తన రాజకీయ గురువని స్పష్టం చేశారు. 1983లో డీఎస్ ద్వారా తాను ఎన్ఎస్‌యూఐలోకి వచ్చినట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. బీజేపీ ఓట్ల కోసం మతం, ప్రాంతాల వారీగా విభజన చేస్తోందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త, నాయకులు పని చేయాలన్నారు.

కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, మాజీవిప్ ఈరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్సీలు ఆరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్‌హందాన్, బాడ్సిశేఖర్‌గౌడ్, గడుగు గంగాధర్, నగర అధ్యక్షులు కేశవేణు, మాజీ మున్సిపల్ చైర్మన్ భక్తవత్సలం(ఢిల్లీ), దిగంబర్‌పవార్, దిలీప్‌పవార్, అశోక్‌గౌడ్, జయసింహాగౌడ్, రామార్తి గోపి, ప్రీతం, వైశాక్షి సంతోష్, వేణుగోపాల్‌యాదవ్, రాజనరేందర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సాయిలు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్, పంచరెడ్డి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ కట్టిన ప్రాజెక్ట్ చెక్కు చెదరలేదు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

వైఎస్ హయాంలో గోదావరిపై కట్టిన ప్రాణహిత చెవేళ్ల ప్రాజెక్ట్ ఇప్పటికీ చెక్కు చెదరలేదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలలో రెండు వేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. 10 నుంచి 20 రోజులలో పార్టీ కార్యకర్తలు, నేతలకు రాజకీయపదవులు వస్తాయన్నారు.

బీఆర్ఎస్ హయాంలో జిల్లా వెనుకంజ



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని రంగాలలో నిజామాబాద్ జిల్లా వెనుకబడి పోయిందని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు లబ్ధి పొందారన్నారు. రబీ పంటలకు సాగునీరు అందించేలా అధికారులను ఆదేశించామన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్‌ను రూ.2 వేల కోట్లతో పూర్తి చేశామని, మరో రూ.300 కోట్లు ఖర్చు పడితే ఉమ్మడి జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికలలో మత తత్వపార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు.

15 పార్లమెంట్ స్థానాలు గెలుస్తాం



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

వచ్చే ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 స్థానాలలో 15 స్థానాలను గెలుస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీ ఎన్నికలలో మోదీ అధికారంలోకి వస్తే చక్కెర పరిశ్రమలు తెరుస్తామని ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. ఈ పదేళ్లలో ఎందుకు తెరువలేదన్నారు. ఈనెల 23 వరకు బోధన్ చక్కెర పరిశ్రమను కమిటీ పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడుతుందన్నారు. చక్కెర పరిశ్రమలను కాంగ్రెస్ ప్రభుత్వం తెరిపిస్తుందన్నారు. ఢిల్లీలో కనీస మద్దతుకు చట్టబద్ధత కల్పించాలని రైతులు ధర్నా చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గినా కేంద్రం ధరలను తగ్గించడం లేదన్నారు.

శ్రేణుల్లో జోష్

- ఎమ్మెల్సీగా మొదటిసారి జిల్లాకు వచ్చిన మహేశ్‌గౌడ్‌కు ఘనస్వాగతం
- భారీ ర్యాలీ నిర్వహించిన నాయకులు, కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొదటిసారి జిల్లాకు వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మొదట ఇందల్వాయి టోల్‌గేట్ నుంచి డిచ్‌పల్లి, ముల్లంగి, కంజర, మోపాల్, తాడెం, బోర్గం మీదుగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహేశ్‌గౌడ్‌ను ఓపెన్ టాప్‌లో ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మహేశ్ మాట్లాడుతూ పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి బీఆర్ఎస్ అరాచకాలను ఎదురొడ్డి పార్టీని కాపాడుకున్న కార్యకర్తలకు న్యాయం చేస్తానని ప్రకటించారు. దీంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. ఓపికగా ఉంటే పార్టీ నాయకత్వం కచ్చితంగా మంచి అవకాశాలు కల్పిస్తుందన్నారు.

టీపీసీసీ చీఫ్ రేసులో ముందంజ..

టీపీసీసీ అధ్యక్ష పదవి రేసులో ముందంజలో ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అధిష్టానం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంతో ఆయన అనుచరులు, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఉమ్మడి జిల్లాలో నాలుగు సీట్లు మాత్రమే గెలుచుకున్న నేపథ్యంలో.. జిల్లాలో బీజేపీ ప్రాబల్యం పెరిగి ఏకంగా మూడు శాసనసభ స్థానాలు గెలుచుకున్న తరుణంలో జిల్లా నుంచి మహేశ్‌గౌడ్‌కు చట్టసభలో ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పించడంపై నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల తరువాత బీసీ కోటాలో మహేశ్‌గౌడ్‌కు పీసీసీ పీఠం దక్కనుందనే వార్తలతో కార్యకర్తలు మరింత జోష్ మీదున్నారు. మహేశ్‌గౌడ్ రాకతో జిల్లాలో ఇతర పార్టీల నుంచి చేరికల పర్వం మరింత స్పీడందుకుంది.

సకాలంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం
- కేసుల దర్యాప్తు పురోగతిపై డివిజన్ల వారీగా సమీక్ష

సుభాష్‌నగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేసి నిర్ణీత గడువులోపు చార్జ్‌షీట్ దాఖలు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల దర్యా ప్తు పురోగతిపై నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పోలీస్ డివిజన్ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్న కేసుల్లోనూ ఎప్పటికప్పుడు లీగల్ ఒపీనియన్ తీసుకుని తదనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. బాధితులకు ప్రభుత్వం తరఫున ఆర్థికసాయాన్ని సకాలంలో అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. పోలీస్‌శాఖ ద్వారా అందించాల్సిన నివేదికలను సత్వరమే పంపించాలని, తద్వారా మిగతా వారికి కూడా ఎక్స్‌గ్రేషియా అందించే ఏర్పాటు చేస్తామని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి శశికళ, ఆర్డీవో వినోద్ కుమార్, డీటీడబ్ల్యూవో నాగూరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు ప్రత్యేక రైళ్లు

- 21 నుంచి 24వ తేదీ వరకు..

కాజీపేట రూరల్(వరంగల్): మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర సందర్భంగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 24 వరకు నిజామాబాద్ – వరంగల్– నిజామాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుస్తాయని పేర్కొన్నారు. నిజామాబాద్–వరంగల్ (07019) ఎక్స్‌ప్రెస్ నిజామాబాద్‌లో ఉదయం 7:05 గంటలకు బయలుదేరి వరంగల్‌కు మధ్యాహ్నం 1:45 గంటలకు చేరుకుంటుంది. అదే విధంగా వరంగల్– నిజామాబాద్ (07020) ఎక్స్‌ప్రెస్ వరంగల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరి రాత్రి 10:30 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుంది.

నకిలీ ఏజెంట్లపై ఉక్కుపాదం!

- చర్యలు చేపట్టిన సీపీ కల్మేశ్వర్
- కన్సల్టెన్సీలకు అద్దెకివ్వాలంటే భవనాల యజమానులు అనుమతి తీసుకోవాలి

డిచ్‌పల్లిలో ఓ గల్ఫ్ ఏజెంట్ 40 మంది నుంచి దాదాపు రూ. కోటి వసూలు చేసి నిండా ముంచాడు. జగిత్యాల్‌లో శ్రీవిఘ్నేశ్వర మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ పేరుతో ఒక వ్యక్తి గల్ఫ్, యూరప్ దేశాలకు పంపించి ఉపాధి కల్పిస్తానని నమ్మించి.. సుమారు 200 మంది నుంచి రూ. 5కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశాడు. మెట్‌పల్లిలో కన్సల్టెన్సీని నిర్వహించిన దొన్కల్‌కు చెందిన వ్యక్తి కెనడా, యూరప్ దేశాల్లో ఉపాధి కల్పిస్తామని చెప్పి సుమారు 300 మంది నుంచి రూ. 2.50 కోట్ల వరకు వసూలు చేసి కనిపించకుండా పోయాడు. ఇలా నకిలీ ఏజెంట్ల మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దీనికి అడ్డుకట్ట వేసేందుకు సీపీ కల్మేశ్వర్ నడుంబిగించారు.

మోర్తాడ్(బాల్కొండ): నకిలీ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపేందుకు సీపీ కల్మేశ్వర్ చర్యలు చేపట్టారు. అమాయకులను మోసగిస్తున్న ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో బాధితులకు న్యాయం చేయడానికి చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా ఇటీవల పలు ఆదేశాలు జారీ చేశారు. ట్రావెల్స్ ఏజెన్సీలు, వీసా కన్సల్టెన్సీలు, మ్యాన్‌పవర్ ఏజెన్సీలకు గదులు అద్దెకు ఇచ్చేవారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, నిర్వాహకులతో పక్కాగా అగ్రిమెంట్ కుదుర్చుకోవాలని సూచించారు. అలాగే వీసా మోసాలపై పోలీసులకు ఫిర్యాదులు వస్తే నామమాత్రపు కేసులతో సరిపెట్టకూడదని, నకిలీ ఏజెంట్లపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మోసగాళ్ల నుంచి బాధితుల సొమ్మును రికవరీ చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. గతంలో ఇలా మోసాలకు పాల్పడిన వారిపై కేవలం ఛీటింగ్ కేసు మాత్రమే నమోదు చేసేవారు. ఇలాంటి కేసులతో న్యాయం జరిగేది కాదు. కానీ ప్రస్తుతం నకిలీ ఏజెంట్లపై ఇమిగ్రేషన్ యాక్ట్‌తో పాటు అవసరమైతే పీడీ యాక్ట్‌ను ప్రయోగించాలని సీపీ కిందిస్థాయి అధికారులను ఆదేశించారు.

లైసెన్స్‌డ్ ఏజెన్సీలు తక్కువే..

రాష్ట్రంలో లైసెన్స్ పొందిన కన్సల్టెన్సీలు 150 వరకు ఉంటే.. ఎలాంటి అనుమతి లేకుండా వీసాల దందా చేసే ఏజెన్సీలు సుమారు 500ల వరకు ఉన్నాయి. మోసగించిన ఏజెంట్ల సంఖ్య రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 400 వరకు ఉంటుందని అంచనా. అనేక మంది ఏజెంట్లపై వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదైనా బాధితుల డబ్బులు మాత్రం రికవరీ జరగడంలేదు. ఏజెన్సీలు, ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటే బాధితులకు కొంతైనా వారి సొమ్ము తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. పాస్‌పోర్టు దరఖాస్తుల పరిశీలన కోసం నియమించిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వీసాలకు సంబంధించి కన్సల్టెన్సీలపై కూడా నిఘా ఉంచాల్సి ఉంటుంది. కానీ వారు పాస్‌పోర్టు పరిశీలనకే టైం ఇవ్వడంతో నకిలీ ఏజెంట్లను గుర్తించి వారి గుట్టురట్టు చేయలేకపోతున్నారు.



నగరంలో నిరసన ర్యాలీ చేపట్టిన వామపక్ష సంఘాల నాయకులు

సార్వత్రిక సమ్మె ప్రశాంతం

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ తలపెట్టిన సార్వత్రిక సమ్మె శుక్రవారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. వివిధ వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

- వివరాలు లోపలి పేజీల్లో..

క్లుప్తంగా

తెయూలో అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగుల ధర్నా



తెయూ(డిచ్‌పల్లి): దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా తెలంగాణ విశ్వవిద్యాలయంలో అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది శుక్రవారం ధర్నా నిర్వహించారు. తెయూ నాన్‌టీచింగ్‌ అవుట్‌సోర్సింగ్‌ యూనియన్‌ సెక్రెటరీ బికోజీ మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. అలాగే ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులరైజేషన్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. ధర్నాలో తెలంగాణ విశ్వవిద్యాలయం అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది నరేశ్‌, మధులిక, రవీందర్‌నాయక్‌, సురేశ్‌, సుధీర్‌, బబ్లూ, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌కు ఎంపిక



బాల్కొండ: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్‌ ఉమెన్‌ టోర్నీకి మెండోరా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గంగోత్రి ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాస్‌ తెలిపారు. విద్యార్థినిని శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 7 నుంచి 19వ తేదీ వరకు కరీంనగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో గంగోత్రి పాల్గొంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ సురేందర్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలుచేయాలి

- ఎంప్లాయీస్‌ జేఏసీ చైర్మన్‌ అలుక కిషన్‌
- కలెక్టరేట్‌ ఎదుట టీఎన్జీవోస్‌ ఆధ్వర్యంలో నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సుభాష్‌నగర్‌: కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ స్కీమ్‌ (సీపీఎస్‌)ను రద్దు చేసి పాత పింఛన్‌ విధానాన్ని (ఓపీఎస్‌) అమలు చేయాలని ఎంప్లాయీస్‌ జేఏసీ చైర్మన్‌ అలుక కిషన్‌ డిమాండ్‌ చేశారు. ఆలిండియా స్టేట్‌ గవర్నమెంట్‌ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ జాతీయ ఉపాధ్యక్షుడు, టీఎన్జీవోస్‌ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారం జగదీశ్వర్‌ ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు భోజన విరామ సమయంలో కలెక్టరేట్‌ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అలుక కిషన్‌ మాట్లాడుతూ.. పాత పింఛన్‌ విధానం కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని గుర్తుచేశారు. పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఆదాయ పన్ను పరిమితిని రూ.10లక్షలకు పెంచాలన్నారు. అవుట్‌సోర్సింగ్‌, కాంట్రాక్ట్‌ ఉద్యోగులను రెగ్యులర్‌ చేయాలని, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించి బడా బాబులకు అప్పజెప్పొద్దన్నారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కార మార్గాన్ని చూపించేవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని హెచ్చరించారు. త్వరలో ఏఐఎస్‌జీఈఎఫ్‌ పిలుపు మేరకు నిరవధిక సమ్మెకు దిగుతామని, ప్రతి ఉద్యోగి ఇందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌ ఏఓ ప్రశాంత్‌కుమార్‌, టీజీవో అధ్యక్షుడు అమృత్‌కుమార్‌, ఉద్యోగ సంఘాల నాయకులు నేతికుంట శేఖర్‌, హన్మంత్‌రెడ్డి, పోల శ్రీనివాస్‌, సతీశ్‌, సుమన్‌కుమార్‌, దినేశ్‌బాబు, జాకీర్‌ హుస్సేన్‌, జనార్దన్‌, మహేందర్‌, జాఫర్‌ హుస్సేన్‌, సంజీవయ్య, సత్యం, వసుమతిదేవి, విజయలక్ష్మి, ఉమాకిరణ్‌, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్‌, అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసి జిల్లాకు మొదటిసారి వచ్చిన పీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్‌ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మున్నూరు కాపు సంఘంలో ఏర్పాటు చేసిన సభలో ఆయనను ఘనంగా సన్మానించారు.

కొనసాగుతున్న ప్రాక్టికల్స్‌

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో ఇంటర్‌ ప్రాక్టికల్స్‌ ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం ఇంగ్లిష్‌ ప్రాక్టికల్స్‌కు 286 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్‌ విద్యాధికారి రఘురాజ్‌ తెలిపారు. మొత్తం జనరల్‌, ఒకేషనల్‌ 17,367 మంది విద్యార్థులకుగాను 17,081 విద్యార్థులు హాజరుకాగా 286 మంది విద్యార్థులు గైర్హాజయ్యారని ఆయన తెలిపారు.

గంజాయిమత్తులో కత్తితో దాడి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో గౌస్‌పాషా అనే వ్యక్తిపై అజయ్‌ కత్తితో దాడి చేశాడు. అంతకుముందు గంజాయిమత్తులో ఉన్న అజయ్‌ తనకు పింఛన్‌ రాలేదని కాంగ్రెస్‌ సభలో హల్‌చల్‌ చేశాడు. దీంతో పోలీసులు అతడిని సముదాయించి బయటికి పంపించారు. బయటికి వచ్చిన అజయ్‌ ఎల్లమ్మగుట్ట కమాన్‌వద్ద గౌస్‌పాషా అనే వ్యక్తిని కత్తితో పొడిచాడు. ఇద్దరి మధ్య గొడవకు కారణం తెలియరాలేదు. గాయపడిన గౌస్‌పాషాను చికిత్సనిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నాల్గోటౌన్‌ ఎస్సై సంజీవ్‌ తెలిపారు.

చట్టబద్ధమైన జీవనం సాగించాలి



మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి

మోపాల్‌: చట్టబద్ధమైన జీవనం కొనసాగించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి అన్నారు. ప్రతి పౌరుడు న్యాయ విజ్ఞానవంతుడు కావాలన్నదే న్యాయసేవ సంస్థ లక్ష్యమన్నారు. మోపాల్‌ మండలం మంచిప్పలోని రైతు వేదికలో సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయా గ్రామాల గిరిజనులను ఉద్దేశించి న్యాయమూర్తి ప్రసంగించారు. గుట్టలను, అడవులను కాపాడాల్సిన బాధ్యత గిరిజనులదేనన్నారు. అటవీప్రాంతంలో నివసించే వారే అడవిని రక్షించాలని, అడవి అన్నిటికీ ఆధారమనే ప్రకృతి నియమాన్ని మరువొద్దన్నారు. అటవీ, రెవెన్యూ, పోడు భూముల మధ్య విభజన రేఖ ఉందని, దాన్ని ఉల్లంఘించొద్దని సూచించారు. న్యాయ సంబంధిత విషయాల్లో న్యాయ సహాయం అందించడానికి న్యాయ సేవాసంస్థ సిద్ధంగా ఉంటుందన్నారు. కల్తీ విత్తనాలు, ఎరువుల కారణంగా రైతులు మోసపోవద్దని, న్యాయసేవా సంస్థ రైతులకు అండగా ఉంటుందన్నారు. నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ కౌన్సిల్‌ రాజ్‌కుమార్‌ సుబేదార్‌, న్యాయవాది నర్రా రామారావు మాట్లాడుతూ.. పార్లమెంట్‌, ఆయా రాష్ట్రాల శాసనసభలు చేసిన చట్టాలు సామాన్యుని దరికి చేర్చే కార్యక్రమాన్ని సుప్రీంకోర్టు నిర్వహిస్తున్నదని, అందులో భాగమే న్యాయవిజ్ఞాన సదస్సులని తెలిపారు. ప్రకృతి సంపదను సంరక్షించుకోవాలని వారు సూచించారు. మంచిప్ప రేంజ్‌ అటవీశాఖ అధికారి రవి మోహన్‌భట్‌, మోపాల్‌ పోలీస్‌ స్టేషన్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ గంగాధర్‌ పాల్గొన్నారు.

కార్మికవర్గానికి అన్యాయం

ఖలీల్‌వాడి: మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌ విధానాలను అనుసరిస్తూ, కార్మికవర్గానికి తీవ్ర అన్యాయం చేస్తోందని, కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని వామపక్షాల నాయకులు అన్నారు. రైతులకు ఇచ్చిన కనీస మద్దతు ధర, రైతు వ్యతరేక చట్టాలను శాశ్వతంగా రద్దు చేయడం వంటి హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ జాతీయ నాయకులు బోస్‌, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, ఐఎఫ్‌ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జి.భూమయ్య డిమాండ్‌ చేశారు. దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వద్ద బహిరంగ సభ నిర్వహించిన అనంతరం ధర్నాచౌక్‌ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత పదేళ్లకాలంలో దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిందన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో ధరలు 30 నుంచి 56 శాతం పెరిగాయన్నారు. పెట్రోల్‌ ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటాను 243 శాతానికి పెంచిందన్నారు. 2023లో కార్పొరేట్లకు 2.14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేశారని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్‌ కంపెనీలకు అప్పగించే వైఖరిని విడనాడాలన్నారు. దేశం ప్రస్తుతం మతతత్వ విద్వేష రాజకీయాలతో అట్టుడుకుతోందని, దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికులు, రైతులపై ఉందన్నారు. నాయకులు ఎం.నరేందర్‌, శివరాజ్‌, సాయగౌడ్‌, గంగారెడ్డి, రమేశ్‌బాబు, కే.భూమయ్య, వి.ప్రభాకర్‌, వేల్పూర్‌ భూమయ్య, బి భాస్కర్‌, వివిధ కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులు డి రాజేశ్వర్‌, రాములు, నర్సింగరావు, భూపతి, సూరి రఘురాం, గణేశ్‌, అషూర్‌, కిరణ్‌, విఠల్‌, రవి, మహిపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటకు కబడ్డీ జట్టు పయనం



నిజామాబాద్‌నాగారం: సూర్యాపేట జిల్లాలో నిర్వహిస్తున్న సబ్‌ జూనియర్‌ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు జిల్లా జట్టు శుక్రవారం బయల్దేరి వెళ్లింది. సబ్‌ జూనియర్‌ బాలబాలికల కబడ్డీ టోర్నీని సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో ఈ నెల 16 నుంచి నిర్వహిస్తున్నారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులను కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు గంగాధర్‌ అందజేశారు. కార్యక్రమంలో కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంద్యాల లింగయ్య, ఒలింపిక్‌ సంఘం ఉపాధ్యక్షుడు జి సంజీవరెడ్డి, కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు జి సాయాగౌడ్‌, కోచ్‌, మేనేజర్లు జ్యోతి, పీఈటీ భార్గవి రెఫరీ అనురాధ, సీనియర్‌ క్రీడాకారులు మల్లికార్జున్‌, వినోద్‌, రమేశ్‌, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

దోమకొండ: మండల కేంద్రంలోని బీబీపేట రోడ్డులో శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొని గ్రామానికి చెందిన గాండ్ల రాములు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. రాములు తన బైక్‌ను వెనుకకు తీసే క్రమంలో దుబ్బాక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తగిలింది. గాయాలపాలైన రాములను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై గణేశ్‌ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

మాక్లూర్‌: మండల కేంద్రంలోని చింతల చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడినవారి నుంచి రూ.6వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

విద్యార్థులకు అస్వస్థత

నవీపేట: మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. పదోతరగతికి చెందిన ఇద్దరు విద్యార్థినులు మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత వాంతులు చేసుకున్నారు. వెంటనే విద్యార్థినులను ప్రైవేట్‌ నర్సింగ్‌హోంకు తరలించి చికిత్స అందించారు. కోలుకున్న తరువాత విద్యార్థినులను డిశ్చార్జి చేశారు.

వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురు అదృశ్యం



గడ్డమీది రాజు (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: రామాయంపేట మండలం దొంగల ధర్మారం గ్రామానికి చెందిన గడ్డమీది రాజు అనే యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13న కామారెడ్డి నుంచి ముంబయి వెళ్లిన రాజు.. ఈ నెల 15న కుటుంబ సభ్యులు ఫోన్‌ చేయగా, ఇప్పుడే కామారెడ్డిలో రైలు దిగి బస్టాండ్‌కు వెళ్తున్నట్లు చెప్పాడు. ఆ తర్వాత నుంచి అతడి ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ వచ్చింది. కుటుంబ సభ్యులు రాజుతో వెళ్లిన వారిని ఆరా తీయగా, కామారెడ్డి బస్టాండ్‌ వద్ద ఆటోలో నుంచి దిగాడని చెబుతున్నారు. అతడి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిన యువతి..

జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌ కాలనీకి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి శుక్రవారం తెలిపారు. కాలనీకి చెందిన సానియా 8 నెలల క్రితం బయటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె తన తల్లి ఖైరున్నీసాతో ఫోన్‌లో మాట్లాడేది. వారం రోజులుగా ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ వస్తుండడంతో తల్లి తన కూతురి ఆచూకీకోసం పలుచోట్ల వెతికి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎల్లారెడ్డికి చెందిన వ్యక్తి



రుడావత్‌ గణేశ్‌ (ఫైల్‌)

ఎల్లారెడ్డి : మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్‌ తండాకు చెందిన రుడావత్‌ గణేశ్‌(36) అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న గణేశ్‌ ఈనెల 10న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాపీ మేస్త్రీ..

ధర్పల్లి: ప్రకాశం జిల్లా పెద్దవార్లపాడు గ్రామానికి చెందిన దొడ్డ యేసయ్య అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. యేసయ్య తన కొడుకుతో కలిసి ధర్పల్లి మండల కేంద్రంలో మేస్త్రీ పనులు చేసుకుంటున్నాడు. నెల రోజుల క్రితం సంక్రాంతి పండుగకు కుటుంబ సభ్యులు సొంతూరుకు వెళ్లగా, యేసయ్య మాత్రం ఇక్కడే ఉండిపోయాడు. పండుగ తరువాత ధర్పల్లికి వచ్చిన కుటుంబ సభ్యులకు యేసయ్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. యేసయ్య కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పర్మిట్‌ రూములో ఒకరి మృతి



వైన్స్‌ ఎదుట ఆందోళన చేస్తున్న మోటాట్‌పల్లి గ్రామస్తులు



సాయిలు మృతదేహం

భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్దరామేశ్వర వైన్‌షాప్‌ పర్మిట్‌ రూములో ఓ వ్యక్తి మృతి చెందాడు. మోటాట్‌పల్లి గ్రామానికి చెందిన తూర్పాటి కుర్మ సాయిలు (55) గురువారం సాయంత్రం తన బైక్‌పై వచ్చి పర్మిట్‌రూమ్‌లో మద్యం సేవిస్తూ కూర్చున్నాడు. వైన్స్‌ నిర్వాహకులు రాత్రి పదిగంటలకు వైన్‌షాప్‌ మూసి పర్మిట్‌ రూమ్‌ను మూసివేసేందుకురాగా, సాయిలు మద్యం సేవిస్తూ కూర్చున్నాడు. బయటికి వెళ్లాలని దుకాణం నిర్వాహకులు సూచించగా, ఒక్కగ్లాస్‌ తాగి వెళ్తానని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. తరువాత్‌ వాచ్‌మెన్‌ కూడా సాయిలును వెళ్లిపోవాలని సూచించగా, ఇంకో క్వార్టర్‌ తీసుకురావాలని డబ్బులు ఇచ్చాడు. వాచ్‌మెన్‌ క్వార్టర్‌ తీసుకువచ్చి ఇవ్వడంతో అక్కడే మద్యం సేవిస్తూ కూర్చున్నాడు. సాయిలు ఉన్న విషయం వాచ్‌మెన్‌ మరిచిపోయాడు. శుక్రవారం పొద్దున వైన్‌షాప్‌ నిర్వాహకులు వచ్చి చూడగా సాయిలు మృతి చెంది కనిపించాడు. వెంటనే యజమానితోపాటు పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న మోటాట్‌పల్లి గ్రామస్తులతోపాటు స్థానికులు పెద్దఎత్తున వైన్‌షాప్‌ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. వైన్స్‌ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా సాయిలు మృతి చెందాడని మధ్యాహ్నం రెండుగంటల వరకు ఆందోళన చేశారు. సమయం ముగిసిన తరువాత మద్యం విక్రయించడం కారణంగానే సాయిలు మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశారు. చివరకు వైన్స్‌ యాజమాన్యం బాధిత కుటుంబానికి రూ.2.30లక్షలు ఇచ్చేలా స్థానిక నాయకులు ఒప్పించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

డొంకేశ్వర్‌ వైన్‌షాప్‌లో తనిఖీలు

- వేర్వేరుగా విచారించిన ఎక్సైజ్‌, పోలీసు అధికారులు



మద్యం శాంపిళ్లను పరీక్షిస్తున్న ఎక్సైజ్‌ అధికారులు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండల కేంద్రంలోని వైన్‌షాప్‌ని అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచడంతోపాటు మద్యాన్ని కల్తీ చేస్తున్నారని ఆరోపణలు రావడంతో మద్యం దుకాణంలో ఎక్సైజ్‌ అధికారులు, పోలీసులు శుక్రవారం వేర్వేరుగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా నిజామాబాద్‌ ఎక్సైజ్‌ సీఐ దిలీప్‌, ఎస్సై మల్లేశ్‌ మద్యం శాంపిళ్లను పరీక్షించారు. స్టాక్‌ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. మద్యాన్ని కల్తీ చేస్తే రూ.5లక్షల జరిమానా విధిస్తామని, లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్‌ అధికారులు వెళ్లిన తర్వాత స్థానిక పోలీసులు వైన్సులో తనిఖీలు చేపట్టారు. ఎస్సై రాహుల్‌ సీసీ ఫుటేజీని పరిశీలించారు. నిర్ణీత సమయం ముగిసిన తరువాత వైన్స్‌ తెరిచి ఉంచితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నికాల్‌పూర్‌లో బెల్టు షాపు సీజ్‌

నికాల్‌పూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తున్న బెల్టు దుకాణంపై దాడులు నిర్వహించి సీజ్‌ చేసినట్లు ఎస్సై రాహుల్‌ తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.10వేల విలువ చేసే మద్యాన్ని సీజ్‌ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని తెల్గాపూర్‌, సింగితం అటవీ ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం రాత్రి పట్టుకున్నట్లు బాన్సువాడ రేంజ్‌ అధికారి అటీబ్‌ తెలిపారు. వాల్టా చట్టాన్ని అతిక్రమించి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని రేంజ్‌ కార్యాలయానికి తరలించామన్నారు. ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించి కేసు నమోదు చేస్తామన్నారు.

కిడ్నాపర్‌గా భావించి మహిళపై దాడి



భిక్కనూరు: పిల్లలను కిడ్నాప్‌ చేసే వ్యక్తి అనుకొని మతిస్థిమితం లేని మహిళను మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామస్తులు శుక్రవారం చితకబాదారు. దోమకొండ మండల కేంద్రానికి చెందిన మతిస్థిమితం లేని లక్ష్మి అనే మహిళ దోమకొండ నుంచి పెద్దమల్లారెడ్డికి ఆటోలో వచ్చింది. అక్కడ ఆటో దిగిన అనుమానాస్పదంగా వ్యవహరించడంతో పలువురు ప్రశ్నించారు. సరైన సమాధానం ఇవ్వకపోడంతో గ్రామస్తులు చితకబాదారు. ఘటనకు సంబంధించి సమాచారం అందడంతో పోలీసులు గ్రామానికి చేరుకొని సదరు మహిళను పోలీస్‌ స్టేషన్‌కు తరలించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లక్ష్మి కుటుంబ సభ్యులు పోలీస్‌ స్టేషన్‌కు వచ్చి ఆమెను తమవెంట తీసుకెళ్లారు.

మూడో అంతస్తు పైనుంచి పడి మృతి

బాన్సువాడ రూరల్‌ : పట్టణంలోని ఎన్జీవోస్‌ కాలనీలో గణేశ్‌ (30)అనే మేస్త్రి మూడో అంతస్తు పైనుంచి పడి మృతి చెందాడు. బిచ్కుంద మండలం శాంతాపూర్‌కు చెందిన గణేశ్‌ కొంత కాలంగా బాన్సువాడలోని ఓ కాంట్రాక్టర్‌ వద్ద పని చేస్తున్నాడు. శుక్రవారం పని చేస్తుండగా మూడో అంతస్తు పైనుంచి జారిపడ్డాడు. వెంటనే అతడిని వెంటనే బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే గణేశ్‌ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, మూడు నెలల కూతురు ఉన్నారు. బాధితుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ కృష్ణ తెలిపారు.

ముదిరిన ఫ్లెక్సీ వివాదం

భిక్కనూరు: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ జన్మదినం సందర్భంగా బస్వాపూర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు కాల్చివేయగా, ఈ వ్యవహారం వివాదాస్పదమైంది. విచారణ నిమిత్తం పోలీసులు కొందరు యువకులను స్టేషన్‌కు పిలించగా, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు తుడుం జీవన్‌తోపాటు మరికొందరు నాయకులు స్టేషన్‌కు వచ్చి.. ఫ్లెక్సీ చించేసింది మీరేనా? అంటూ చేయిచేసుకున్నారు. గురువారం రాత్రి ఇంటికి వెళ్లిన యువకులు విషయాన్ని తమ కుటుంబ సభ్యులతోపాటు బీఆర్‌ఎస్‌ నాయకులకు తెలిపారు. బీఆర్‌ఎస్‌ నాయకులు మాజీ విప్‌ గంప గోవర్దన్‌ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా, ఆయన ఎస్పీ సింధుశర్మతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో యువకులపై చేయిచేసుకున్న వారిపై కేసు నమోదు చేయాలని సీఐ సంపత్‌, ఎస్సై సాయికుమార్‌ను ఎస్పీ ఆదేశించారు. కేసుల నమోదు విషయం షబ్బీర్‌అలీ దృష్టికి వెళ్లడంతో ఆయన సీఐ, ఎస్సైతో ఫోన్‌లో మాట్లాడారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసులు నమోదు చేయాలని, చేయి చేసుకున్న వారిపైకాకుండా వేరే వారిపై కేసులు చేయొద్దని సూచించారు.







జిల్లా కేంద్రంలో నీలకంఠేశ్వరుని రథోత్సవం వైభవంగా కొనసాగింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జాతరలో కోలాహలం నెలకొంది.